క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

మహానందిలో భక్తుల సందడి



పెద్ద కోనేరులో భక్తుల స్నానాలు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయానికి వచ్చిన భక్తులు ఉచిత, శీఘ్ర, స్పర్శ దర్శనం, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా గంటల తరబడి వేచి ఉండి శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పూజల్లో పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం



స్నేహితుడి కుమార్తె వివాహానికి నగదు అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామానికి చెందిన సగినేల స్వాములు 2024 సంవత్సరం నవంబర్‌లో అనారోగ్యం కారణంతో మృతి చెందాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు, కాగా.. పెద్ద కుమార్తె వివాహానికి ఫాస్టర్ రెవరెండ్ కిరణ్ చేతుల మీదుగా సగినేల సుబ్బన్న, ఆర్టీసీ నాగేంద్ర, గాదె దాస, పబ్బతి రమేష్, సురేష్, సతీష్ సీ.ఎస్.ఐ చర్చిలో ఆ కుటుంబ సభ్యులకు నగదు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుకొని తమవంతుగా స్నేహితుడి కుటుంబానికి సహాయ సహకారాలు అందించినట్లు మిత్రులు తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్



మద్యం బాటిళ్లు, నిందితుడు పలుచాని మహేశ్వరరెడ్డితో పోలీసులు

పగిడ్యాల: ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్టు దుకాణం నిర్వహిస్తూ అక్రమంగా 292 మద్యం బాటిళ్లను నిల్వ చేసి విక్రయిస్తున్న పలుచాని మహేశ్వరరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన నిందితుడు కొంత కాలంగా అక్రమ మద్యం వ్యాపారం కొనసాగిస్తున్నాడన్నారు. శనివారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఇంట్లో సోదాలు నిర్వహించగా అతని వద్ద వివిధ బ్రాండ్లకు సంబంధించిన 292 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేసి నందికొట్కూరు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఈనెల 31వ తేది వరకు రిమాండ్‌కు ఆదేశించారని వెల్లడించారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుడు అబిదాల్లి కుటుంబానికి రూ.38 వేలు ఆర్థిక సాయాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీలో అబిదాల్లి అనేక సంవత్సరాల నుంచి కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. మున్సిపల్ కార్మికులు రూ.38 వేలు బాధితా కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు, గొడుగురాజు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో నీటికి కటకట!

- కుళాయిలకు నిలిచిన నీటి సరఫరా
- పదిరోజులైనా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



ఎస్సీ కాలనీకి సమీపంలోని పబ్లిక్ మినీ ట్యాంక్ నుంచి తోపుడు బండ్లతో నీటిని తీసుకెళ్తున్న మహిళ,



రచ్చకట్ట అరుగు వద్ద గల మినీ ట్యాంక్ వద్ద నీటి కోసం నిరీక్షిస్తున్న దృశ్యం

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటింటి కుళాయి వినియోగదారులకు నీటి సరఫరా నిలిపివేయడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. నీటి అవసరాలు తీరక పశువుల యజమానులు ఎదుర్కొంటున్న బాధలు వర్ణనాతీతం.

పైపులైన్ సమస్య..

మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో పైపులైన్ లీకేజీ తదితర సమస్యల కారణంగా గత పదిరోజులుగా కుళాయిలకు నీరు సరఫరా కావడంలేదు. అలాగే పబ్లిక్ మినీ ట్యాంక్‌లకు కూడా మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. ఇవి కుటుంబ, పశువుల అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో మోటర్ బైక్‌లు, తోపుడు బండ్లతో సుదూర ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ ట్యాంక్‌లను ఆశ్రయిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

పాచీపట్టినా.. పట్టించుకోరు..

ట్యాంక్‌లు కూడా పాచీపట్టి దుర్వాసన వస్తున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పదిహేను రోజులకోసారి శుభ్రం చేయడమే కాకుండా ట్యాంక్‌లకు సరఫరా చేసే ప్రతి ఫిల్లింగ్‌ను కూడా క్లోరినేషన్ చేయాలనే నిబంధనలను పాటించడం లేదు. ఇంకా క్లోరినేషన్ చేసే తేదీలను కూడా ట్యాంక్‌లపై కనబర్చాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించడానికి పంచాయతీ అధికారులు స్పందించి ఇంటింటి కుళాయి కనెక్షన్‌లకు నీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..

నీటి సమస్యపై సచివాలయం 2 కార్యదర్శి మల్లికార్జునను అడుగగా పైప్‌లైన్‌లు లీకేజీ ఉన్నాయి, కొద్ది రోజుల నుంచి ఇంటింటి కుళాయి వినియోగదారులకు నీటి సరఫరా సక్రమంగా రావడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే స్పందించి మరమ్మతులు చేపడతామని చెప్పారు. ఇంకా ఎక్కడైన సమస్య ఉంటే వాటర్‌మెన్ ద్వారా తెలుసుకుని సమస్య లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

నేడు దేవాలయ భూముల బహిరంగ వేలం

పాములపాడు: మండల కేంద్రంలోని దేవాదాయ భూముల కౌలుకు సోమవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి వెంకటరమణ ఆదివారం తెలిపారు. స్థానిక శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం ఆవరణలో వేలం పాటలు ఉంటాయన్నారు. గ్రామంలోని చెన్నకేశవ ఆంజనేయస్వామి, చౌడేశ్వరీదేవి, నాగలింగేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించిన 63.14 ఎకరాల భూములకు కౌలు వేలం పాటలు జరగనున్నాయి. ఆసక్తిగల రైతులు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొవచ్చనని వివరించారు.

నేడు తిరంగా ర్యాలీ

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల టర్నింగ్ నుంచ గౌడ్ సెంటర్ వరకు సోమవారం ఉదయం 9 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణు ఆదివారం తెలిపారు. కార్యక్రమం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తున్న కూలీలు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో పైపు లైన్‌కు మరమ్మతులు చేశారు. ఈ నెల 17న ×పైపులైన్ లీకేజీ నీరు వృథా౯ అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆదివారం లీకేజీ అయిన పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టారు. దీంతో హెచ్ఎస్ఆర్ ట్యాంకుకు నీరు సాఫీగా ఎక్కిస్తున్నారు. గ్రామంలోకి యథావిధిగా వీధి కుళాయిలకు నీటి సరఫరా జరుగుతోంది.

శాస్త్రోక్తంగా పల్లకీ సేవ



స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు సన్నద్ధం

- పొలం పనుల్లో అన్నదాతల బిజీ బిజీ
- రైతు భరోసా కేంద్రాలకు చేరుకోని ఎరువులు, విత్తనాలు



ఆత్మకూరు వద్ద దుక్కి దున్నతున్న రైతు

ఆత్మకూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ముందస్త ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు చేసుకున్న పొలాలు వర్షాలకు బాగా పదునయ్యాయి. ప్రస్తుతం అన్నదాతలు పొలాలను సాగు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నుతూ,ఎరువులు చల్లి పొలాలను చదును చేస్తున్నారు.

పత్తి, మొక్కజొన్న సాగుకే మొగ్గు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న, పత్తి పంట సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఆత్మకూరు డివిజన్‌లో సాధారణంగా 2,792 హెక్టారుల్లో వరి సాగు చేస్తారు. ఈ పంటకు తోడు 7,500 హెక్టారుల్లో మొక్కజొన్న, 4 వేల హెక్టారుల్లో పత్తి పంట సాగవుతుంది. అలాగే.. కంది, పెసర, మిర్చి పంటలను కూడా వేయనున్నారు.

ఆర్ఎస్‌కేలకు చేరుకోని ఎరువులు, విత్తనాలు

అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతుండగా ఇప్పటికీ రైతు సేవా కేంద్రాలకు జీలుగ, మినుము, కంది, పెసర విత్తనాలు చేరుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మే నెలలోనే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, మినుము, కంది విత్తనాలను పంపిణీ చేసేవారు. ఎరువులు కూడా రైతుసేవా కేంద్రాలకు సకాలంలో చేరుకునేవి. అయితే కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే ఏ పంటకు సంబంధించి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాలకు చేరుకోకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లోని దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.

ముందుగానే వర్షాలు కురుస్తున్నాయి



మే ప్రారంభం నుంచే రెండు వారాలుగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాం. నాకున్న 10 ఎకరాల్లో ట్రాక్టర్ల ద్వారా నాగళ్లతో దుక్కి దున్ని చదును చేయిస్తూనే మరోవైపు ఎరువులు చల్లిస్తున్నా. అదునైన వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం. – అశోక్, రైతు, ఆత్మకూరు

భగవద్గీతను చదవడం అలవర్చుకోవాలి



వీరాపురంలో త్రైతసిద్ధంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీతను చదవడం అలవర్చుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని జీ.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలలో త్రైతసిద్ధాంత భగవద్గీత జ్ఞానగ్రంథాల ప్రచారం నిర్వహించారు. భగవద్గీతను పఠించడం ద్వారా మనషులలో పరివర్తనలో మార్పు వస్తుందన్నారు. సమాజంలో మంచి, చేడులు తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుమారాచారి, సంజీవ, పార్థసారథి, చక్రపాణి, నాగమద్దిలేటి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పైపాలెం రైతులకు అండగా ఉంటాం

నందికొట్కూరు: సోలార్ గ్రీన్ కో బాధితులైన పైపాలెం రైతులకు అండగా ఉంటామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ చెప్పారు. ఆదివారం మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామ రైతులపై గ్రీన్ కో ఆగడాల గురించి వారు చర్చించారు. గ్రీన్ కో సోలార్ నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ ప్రజలు, రైతులు వారికి తెలియజేశారు. వారు మాట్లాడుతూ గ్రీన్ కో సోలార్ కంపెనీ గ్రామసభ నిర్వహించకుండా, ప్రజల ఆమోదం లేకుండా పనులు ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంట పొలాలకు వెళ్లే రస్తాలను గ్రీన్ కో కంపెనీ ఆక్రమించుకోవడం దారుణమని చెప్పారు. భూముల చుట్టు ఉన్న రాళ్లకతులను రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు తొలగిస్తున్నారని నిలదీశారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు జీవనాధారంగా ఉన్న కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడం సబబుకాదన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా గ్రీన్ కో సోలార్ కంపెనీకి ఎలా అప్పగిస్తారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా, మద్దిలేటి, రామకృష్ణ, ఓబులేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మహానాడు



మహానాడులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

నందికొట్కూరు: ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, కనీసం ఫ్లెక్సీలు, జెండాలు కూడా కనిపించకుండా తూతూ మంత్రంగా టీడీపీ మహానాడు సాగిందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్.ఎస్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి మహానాడు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య పాల్గొని ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానాడు కార్యక్రమం బహిరంగ ప్రదేశంలో జరపకుండా ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించడంలో అంతర్యమేమిటని పలువురు పశ్నిస్తున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు దేవళ్ల మురళి, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, ఆయా మండలాల కన్వీనర్లు రమేష్‌రెడ్డి, పలచాని మహేశ్వరరెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాజులపల్లెలో యువకుడిపై దాడి



అబ్దుల్ ఖాదర్

మహానంది: రోడ్డుపై ఆగి ఉన్న ఓ యువకుడిని కారులో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి గాజులపల్లెలో చోటు చేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...గాజులపల్లెకు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకుడు షేక్ అబ్దుల్ ఖాదర్ రాత్రి గాజులపల్లె మెట్ట వద్ద ఉన్న ఓ జనరల్ స్టోర్ దగ్గర ఉండగా.. అంతలోనే ఎర్టిగా కారులో నలుగురు వ్యక్తులు వచ్చారు. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి ఒక్కసారిగా అబ్దుల్ ఖాదర్ ముఖంపై పిడిగుద్దులు కురిపించి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా వివాహేతర సంబంధం, ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించడమే దాడికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. కర్నూలుకు చెందిన వారు దాడికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసినట్లు సమాచారం.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందికి వచ్చిన ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక చెరువ కట్టపై వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్, నంద్యాల జిల్లాల నుంచి సుమారు 12 జతల ఎద్దు పాల్గొన్న ఈపోటీల్లో కర్నూలు జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, నంద్యాల జిల్లా వెంకటగిరి గ్రామానికి శశాంక్ ఎద్దులు కంబైన్డ్‌గా ప్రథమ స్థానంలో నిలిచి రూ.40,000 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. రెండో స్థానంలో ప్రొద్దుటూరులోని అయోధ్యనగర్, మూడవ స్థానంలో కర్నూలు జిల్లా తాండ్రపాడు, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా కానాల గ్రామం, ఐదవ స్థానంలో కర్నూలు జిల్లా వెంకటగిరి గ్రామం, ఆరవ స్థానంలో నంద్యాల జిల్లా దాసరిపల్లె గ్రామం, ఏడో స్థానంలో వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లె గ్రామం, ఎనిమిదో స్థానంలో నంద్యాల జిల్లా కోటకందుకూరు , తొమ్మిదో స్థానం నంద్యాల జిల్లా అప్పనపల్లె గ్రామం , బండిఆత్మకూరు గ్రామాల వృషభాలు నిలిచాయి. పదవ స్థానంలో సత్యసాయి జిల్లా ముక్తాపురం, పదకొండో స్థానం నంద్యాల జిల్లా ఇసుకపల్లె గ్రామాలకు చెందిన వృషభరాజములు నిలిచాయి. 2వ స్థానం నుంచి 11వ స్థానం వరకు నిలిని ఎడ్ల యజమానులకు దాతలు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కొలిమి షరీఫ్, మహమ్మద్ హనీఫ్, చిన్న రాముడు యాదవ్, కొలిమి ఉసేన్‌వలి, షేక్.ఇమాంహుస్సేన్ (రిటైర్డ్ హెచ్‌ఎం), ఖలీల్, రఫీ, మాబుషరీఫ్, షేక్ దాదాపీర్, మహబూబ్‌బాషా, రహమతుల్లా, చెంబుల మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వర్షపు నీటితో ప్రమాదకరంగా ఉన్న పగిడ్యాల రోడ్డు



రోడ్డుకిరువైపులా ఇలా.. ప్రయాణం ఎలా..!

పగిడ్యాల: అధికారంలోకి వచ్చిన మరుక్షణమే నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఇచ్చిన హామీ ఏమైందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏడాది గడుస్తున్నా రోడ్డు దుస్థితి మారలేదు. ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రోడ్డుకిరువైపులా గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని చూసి ప్రయాణం చేసేదేలా అంటూ లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, పాలమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు, అంజనేయనగర్ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎదురెదురు వాహనాలు వస్తే సైడ్ తీసుకోలేని పరిస్థితి ఉండటంతో మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నది ప్రజలను మోసం చేయడానికేనా అంటూ అసహనానికి గురవుతున్నారు.

వారపు సంత.. సమస్యల మోత

- రహదారికిరువైపులా దుకాణాలు
- వినియోగదారులకు ఇక్కట్లు



ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన దుకాణాల మధ్య వెళ్తున్న పశుగ్రాసం ట్రాక్టర్లు

పాములపాడు: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతలో సమస్యలు మోత పుట్టిస్తున్నాయి. వారపు సంతలో కూరగాయలు, ఇతర నిత్యవసర వస్తువుల దుకాణాలు వెలుస్తాయి. ఈ దుకాణాలన్ని ప్రధాన రహదారికిరువైపులా వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు, ఇతర వస్తువుల కొనుగోలుకు మండల కేంద్రానికి తరలిరావడంతో రహదారి కిక్కిరిసి పోయింది. వినియోగదారులు రహదారి వెంట ఉన్న దుకాణాల్లో తమకు కావాల్సిన వస్తువుల కొనులు చేయాల్సి ఉంటుంది. ఈ రహదారి గ్రామంలోని వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులతో పాటు, మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వాడాల గ్రామాలతో పాటు జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల, కనకయ్య కొట్టాల గ్రామాలు, అంతే కాకుండా నంద్యాలకు వెళ్లడానికి అనుకూలం. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు సైతం ఈ రహదారి గుండానే ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వినియోగదారులు, వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ వారు ప్రతి వారం దుకాణదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

గతంలో ఆలయ ప్రాంగణం చుట్టూ..

గతంలో శ్రీచౌడేశ్వరి దేవి ఆలయప్రాంగణం చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు. అయితే వినియోగదారులు పెరగడం, దుకాణాలు పెరగడంతో చౌడమ్మ దేవాలయానికి ఉన్న నాలుగు రస్తాల వెంట దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఇంకెన్నాళ్లు సమస్యల మధ్య వారపు సంత నిర్వహిస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో వారపు సంత నిర్వహణ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: క్యాండిల్ లైట్ మెమోరియల్ డే మిరీవాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ర్యాలీని ఆదివారం పట్టణంలో చేపట్టారు. సభ్యులు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి ఆత్మశాంతి కోసం ర్యాలీని నిర్వహించామన్నారు.హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపరాదని, వారికి మనోధైర్యాన్ని కలిగించాలని కోరారు. మస్తానయ్య ప్రసాద్, మెరీబా సిబ్బంది, ప్రోగ్రాం మేనేజర్ అలీఖాన్, రాజు, యువరాజు పాల్గొన్నారు.